# షరా మామూలే

రంగా రెడ్డి అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటూంటే అతని భార్య లక్ష్మి చిరాగ్గా వచ్చింది.

"ఏమిటి ఆడాళ్ళకంటె అన్యాయంగా ముస్తాబవుతున్నారు? మీ ఫ్రెండ్‌వాళ్ళు మనల్ని పిలిచింది లంచ్‌కి – డిన్నర్‌కి కాదు" అంది టీజింగ్‌గా.

"నువ్ పొద్దున్నుంచీ ఆ అద్దాన్ని అతుక్కుపోయి ఇప్పటికి వదిలావ్. పైగా నాది ముస్తాబంటావా?"

అంటూ మరోసారి ఫైనల్‌గా అద్దంలో చూసుకున్నాడు రంగారెడ్డి.

"చూశావా ఇప్పుడెంత గ్లామరస్‌గా ఉన్నానో – మన కాలనీ హీరో జనార్ధన్ ఏం పనికొస్తాడు నా ముందు"

"జనార్ధనేం ఖర్మ? షారూక్ ఖాన్ కూడా పనికిరాడు మీ ముందు – పదండి – పెద్ద నసబేరం దొరికారు"

అంటూ అతను బయటకు రాగానే ఇంటికి తాళం వేసింది. రోడ్ల మీద అతని స్కూటర్ గేదెల మధ్యనుంచీ, మేకల మధ్యనుంచీ, కుక్కల మధ్యనుంచీ, కొంతమంది అదే తరగతికి చెందిన రోడ్ వీరుల మధ్యనుంచీ రకరకాల విన్యాసాలు చేశాక అతని స్కూటర్ ఫ్రెండ్ ఇంటి ముందాగింది.

ఆ ఇల్లు చూస్తూనే లక్ష్మి ఇంప్రెస్ అయిపోయింది.

"మీ ఫ్రెండ్ వాళ్ళు మీలాగా కాకుండా కొంచెం డిగ్నిఫైడ్ పీపుల్లాగున్నారు. ఇల్లు బయటనుంచే చూడ్డానికి బావుంది" అంది.

రంగారెడ్డి ఒప్పుకున్నాడు.

"ఆ మాట నిజమేలే. వాడి ఫాదరు డాక్టరు. అతని భార్య ఫాదర్ కాలేజ్ ప్రిన్సిపాల్. అందుకని బాగా కల్చర్డ్ ఫ్యామిలీ. మీ ఫాదర్ లాగా రైల్వే వ్యవహారం కాదుగా"

ఆ మాటతో లక్ష్మికి పొడుచుకొచ్చింది.

"అబ్బో – మీ ఆర్టీసీ ఫ్యామిలీ కంటే నయమే లెండి"

ఇద్దరూ మొదటి మెట్టు ఎక్కేసరికి ఇంట్లో నుంచి ఓ స్టీలు గిన్నె రాకెట్‌లా వచ్చి రంగారెడ్డి కాలుని చితక్కొట్టేసరికి “అమ్మో” అంటూ ఒక్క గెంతు గెంతాడు.

“అదేంటి? ఈ గిన్నె ఎక్కడి నుంచి వచ్చింది?” అంది లక్ష్మి ఆశ్చర్యంగా చుట్టూ చూస్తూ.

అప్పుడే మరో గరిటె వచ్చి ఆమె భుజానికి తగిలే సరికి భయంతో గావుకేక పెట్టింది.

“ఇవన్నీ మీ ఫ్రెండ్ ఇంట్లో నుంచి వచ్చి పడుతున్నాయండీ” అంది భయంగా.

ఇద్దరూ భయంగా మెట్లెక్కేసరికి లోపల్నుంచి తారస్థాయిలో ఆడగొంతు వినిపించింది – హాల్లో ఎదురుగా రాధ, మోహన్రావ్ ఒకరి కెదురుగ్గా ఒకరు బోర్డర్స్‌లో పాకిస్తాన్, ఇండియా సైనికుల్లా నిలబడి ఉన్నారు–

“నేనేం పనిమనిషిననుకున్నారా? సోఫాలు నేనే సర్దాలా? ఇదిగో ఇలా సర్దుతా’ అంటూ మోహన్ బార్య సోఫాలో దిళ్ళు తీసి వీధి వేపు విసిరేసే సరికి వాటి నుంచి తప్పించుకోడానికి రంగారెడ్డి, లక్ష్మి గాల్లోకి ఎగరాల్సి వచ్చింది.

“ఈ మాగజైన్లూ ఫ్లవర్ వాజులూ, టేబుల్ లైట్లూ, ఫాన్లూ అన్నీ నేనే ఎరేంజ్ చేయాలా. అన్నీ – అన్నీ – అన్నీ” అంటూ మళ్ళీ కొన్ని చేతికందిన సామాన్లు వీధిలోకి విసిరి – అవన్నీ దార్లోనే రంగారెడ్డి లక్ష్మిలకు తగిలి హాల్లోనే కిందపడడంతో అప్పుడు వాళ్ళను చూశారిద్దరూ.

మోహన్ మొఖంలో ఎక్స్‌ప్రెషన్ ఛటుక్కున మార్చాడు.

“హాలో రంగారెడ్డి రండి! కూర్చోండి. ప్లీజ్ కమిన్” అన్నాడు.

ఇద్దరూ జంకుగానే వెళ్ళి వాళ్ళిద్దరి మధ్యలో ఉన్న సోఫా మీద కూర్చున్నారు. ఆ సిట్యుయేషన్‌ని తేలిక పర్చడానికి తన భార్యను అతని భార్యకు పరిచయం చేశాడు రంగారెడ్డి.

“మా మిసెస్ లక్ష్మి – ఈమె మా మోహన్ మిసెస్”

“నమస్తే” అంది లక్ష్మి.

“నమస్తే కోపంగా అంది రాధ.

“నేనూ మోహన్ – కొంతకాలం రూమ్‌మేట్స్‌గా ఉండేవాళ్ళమండీ. కానీ మీ పెళ్ళికి మాత్రం రావటం పడలేదు”

వాళ్ళ టాపిక్‌ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తూ అన్నాడు. అయినా రాధ మొఖంలో కోపం, ద్వేషం అలాగే ఉండే సరికి మోహన్ కల్పించుకున్నాడు.

"పరిచయం చేస్తుంటే అలా గొడ్డులా నిలబడతావేం? ఇంటికొచ్చిన అతిధులను మర్యాదగా పలుకరించడం కూడా తెలీని బ్రూట్‌లాగున్నావ్? అన్నాడతను.

దాంతో రాధ మరీ పేట్రేగిపోయింది.

"బయటివాళ్ళ ముందు భార్యనెలా గౌరవించాలో తెలీని ఇడియట్స్ వంశం మీది – నాకు మీరేం నేర్పఖ్ఖర్లేదు" అంది పౌరుషంగా.

"నీ లాంటి ఎద్దుకి కామన్ సెన్స్ ఉన్నవాడెవడూ గౌరవం ఇవ్వడు. నీ కంటే చదువూ, సంస్కారం లేని లేబర్ క్లాస్ నయం" రెచ్చిపోతూ అన్నాడు మోహన్.

"లేబర్ క్లాస్ మీది! నాలుగు డిగ్రీలుండగానే పెద్ద కల్చర్ అనుకుంటున్నారేమో! వంద డిగ్రీలున్నా మీ లాంటోళ్ళు మా కాలిగోటికి చాలరు"

"ఏయ్ నోరు మూస్తావా లేదా? ఇంకోసారి వాగావంటే చెంప పగలకొడతాను"

"కొట్టరా చూద్దాం! ఇక్కడెవరూ గాజులు తొడుక్కుని కూర్చోలా! కాలేజీలో చదివేప్పుడు ఇంతకన్నా పొగరుబోతులకే బుద్ధి చెప్పాను"

రంగారెడ్డి, లక్ష్మిలు మొఖాలు చూసుకున్నారు. ఆ ఇంటి నుంచి ఎంత త్వరగా బయట పడితే అంత మంచిది అన్న విషయం ఇద్దరికీ అర్ధమయింది.

కానీ ఆ పని ఎలా చేయాలా అనేదే తేలీట లేదు.

ఈలోగా మళ్ళీ మోహన్ అందుకున్నాడు.

"ఏయ్ పోవే లోపలకు. నీ చెత్త మొఖం చూస్తేనే అసహ్యం నాకు"

"నాకూ అంతే – నీ చిల్లర మొఖం చూస్తేనే అలర్జీ"

రంగారెడ్డి నెమ్మదిగా లేచి నిలబడ్డాడు.

"చూడు మోహన్! మేము అర్జంటుగా కూకట్ పల్లి వెళ్ళాల్సిన పని ఉంది. ఇక వెళ్తాం" అన్నాడు భయంగా.

మోహన్ చిరాగ్గా చూశాడు.

"అదేంటి? మిమ్మల్ని లంచ్‌కి ఇన్‌వైట్ చేస్తే వెళ్ళిపోతానంటారేమిటి? భోజనం చేయకుండా ఎలా వెళ్తారు? కూర్చోండి.

"అది కాదు బ్రదరూ అనుకోకుండా కూకట్‌పల్లిలో మా బంధువొకాయనకు వంట్లో బావుండలేదని ఫోన్ వచ్చిందన్నమాట! వెంబడే వెళ్ళి చూడకపోతే బావుండదు లంచ్‌దేముంది – ఇంకో రోజు వస్తాం" ఈసారికి మమ్మల్ని వదిలేసేయ్"

"అవునండీ ఇక్కడ ఉండేవాళ్ళమేకదా! మరోసారెప్పుడయినా వస్తాం" తనూ కల్పించుకుంటూ అంది లక్ష్మి.

"నోనోనో! అలా అంటారేమిటి? లంచ్‌కి ఇన్‌వైట్ చేశాను. మీరు వచ్చారు. భోజనం చేయకుండా మిమ్మల్ని వెళ్ళనిచ్చే ప్రసక్తే లేదు" అని భార్య వేపు తిరిగాడు.

"ఏయ్. ఏడుపు మొఖం! ఇంకా నుంచుని చూస్తున్నావేమిటి? వెళ్ళు లోపలికెళ్ళి లంచ్ ఏర్పాట్లు చూడు"

ఆమె కోపంతో నమిలేసేట్లు చూసింది.

"అడ్డమయినోళ్ళకూ వండి వార్చడానికి ఇక్కడ. మీ నౌఖరుగాళ్ళెవరూ లేరు. వెళ్ళి నీ ఏడుపు మొఖంలో నువ్వే వండుకో"

"అతిథుల ముందు ఎలా మాట్లాడాలో కూడా తెలీని మేనర్‌లెస్ బ్రూట్ నువ్వు! కల్చర్ అంటే ఏమిటో తెలీకుండా నిన్ను గొడ్డుని పెంచినట్లు పెంచారు మీ వాళ్ళు"

"అబ్బో – మీ వాళ్ళూ నీకు నేర్పించారుగా గాడిదలాగా ఓండ్రించటం, కుక్కలాగా మొరగటం"

"ఏయ్ ముందిక్కడి నుంచి పోతావా లేదా? నీలాంటి దాన్ని ఆరోజే తన్ని ఇంటినుంచి గెంటాల్సింది నేను"

"నేనేం దిక్కులేని దాన్ననుకున్నావా. తన్ని తగిలేసినా ఇక్కడే బానిసలాగా పడుండడానికి? మంగళసూత్రం తెంపి నీ మొఖాన కొట్టి హాపీగా వెళ్తాను"

ఇంక లాభం లేదని రంగారెడ్డి మళ్ళీ ప్రయత్నం చేశాడు.

"సారీ బ్రదర్. కూకట్‌పల్లి వెంటనే వెళ్ళకపోతే బావుండదు. దగ్గర బంధువుల్లో వ్యవహారం! ఈ సారికి మాకు శెలవిస్తే ఇంకోసారి తీరిగ్గా ఉదయం వచ్చి సాయంత్రం వరకూ మీ ఇద్దరితోనూ సరదాగా గడిపి వెళ్తాం. సరేనా?"

రాధ పాము పడగలా తెలెత్తింది.

'పిలిచేది ఆ మనిషే కదా. ఆ గొడ్డుతోనే సరదాకబుర్లు తగలెట్టుకోండి. మధ్యలో నా కెందుకు చెత్తకబుర్లు?" అంది కోపంగా.

"చూశారా రంగారెడ్డి! దానిది నీచమయిన బుద్ధి కాకపోతే మనకు సంబంధంలేని వ్యక్తులతో అలాగేనా మాట్లాడటం?"

"నువ్ భోజనానికి పిలిచే ప్రతి పనికిరాని రకాలతో మర్యాదిచ్చి మాట్లాడాల్సిన అవసరం నాకు లేదు"

"మోహన్, ప్లీజ్. మమ్మల్ని వెళ్ళనీ"

"విన్నావంటే, నీ తప్పుడు ప్రవర్తన వల్లే వాళ్ళు వెళ్ళిపోతామంటున్నారు. నీకేమయినా సిగ్గుందా?'

"సిగ్గులేంది నీకు . నీ వాళ్ళకు, తప్పుడు ప్రవర్తనలు నీవి. నీ వాళ్ళవి"

"నీ బుద్ధి ముందే తెలిసుంటే పెళ్ళి పీటలమీదే జుట్టు పట్టి గెంటేవాడిని"

"నీ బుద్ధీ నాకు తెలిసుంటే నీ బదులు ఒక రిక్షా వాడినయినా చేసుకునేందుకు వప్పుకునేదాన్ని"

"థూ – నీ మొఖం తగలెయ్య"

"థూ – నీ బుద్ధి తగలెయ్య. అసలు నువ్విలాంటి విష సర్పానివని తెలిసుంటే మొదటిరాత్రే పాలల్లో విషం కలిపి ఇచ్చేదానిని"

"నీదింత చెత్త మెంటాలిటీ అని తెలిసుంటే నువ్విచ్చే పాలల్లో విషం ఉందని తెల్సినా హాపీగా తాగేవాడిని"

"థూ"

"థూ"

రంగారెడ్డికి ఇంక చిర్రెత్తుకొచ్చింది.

"కాసేపు నోర్మూసుకోండి" అంటూ బిగ్గరగా అరచాడు. ఇద్దరూ అతని కేకకు ఉలిక్కిపడ్డారు.

"ఇద్దరూ చదువుకున్నాళ్ళు. సంస్కారం ఉన్నవాళ్ళు. అయినాగానీ అవేమీ లేని మూర్ఖుల్లా ఏమిటీ ప్రదర్శన? ఇంటికొచ్చిన అతిధులముందు అలా జ్ఞానం విచక్షణ లేకుండా తిట్టుకుంటుంటే మీ పరువుతో పాటు ఆ అతిధుల పరువు మర్యాదలు కూడా పోతాయన్న ఇంగితం కూడా లేదేమీకు?

ఆవేశంగా అరచాడు రంగారెడ్డి.

రాధ కోపంగా చూసిందతని వేపు.

"ఇదిగో – తప్పంతా మీ ఫ్రెండ్‌ది పెట్టుకుని మధ్యలో నన్నన్నారంటే మర్యాదగా

ఉండదు. భార్యను అలా అందరి ఎదుటా నోటికొచ్చినట్లు కూయటం అసలు సంస్కారమేనా?”

దాంతో లక్ష్మికూడా జోక్యం చేసుకోక తప్పలేదు.

“నువ్ మాత్రమే తక్కువ తిన్నావని? అతనొకటంటే పది తిరిగి అంటూనే ఉన్నావ్‌గా? మమ్మల్ని చూడు. మా పెళ్ళయి ఇంత కాలమయినా ఒక్కసారి కూడా మీలాగా దెబ్బలాడుకోలేదు. తిట్టుకోలేదు. తెలుసా నీకు? లక్ష్మి అలా ఎటాక్ చేసేసరికి రాధ కొంచెం కంగుతింది.

“ మాక్కూడా అభిప్రాయం బేధాలొస్తయ్. మాటా మాటా వస్తుంది. అయినా ఇద్దరం కూర్చుని సమస్య గురించి కూల్‌గా చర్చించుకుంటాం. ఎవరి వాదనలో న్యాయం ఉందనిపిస్తే ఆ వాదనను అంగీకరిస్తాం” అన్నాడు రంగా రెడ్డి వెంటనే లక్ష్మి అందుకుంది మళ్ళీ.

“మీలాగా దెబ్బలాట రాగానే రోడ్డున పడటం, అతిధుల ఎదురుగ్గానే కాట్లకుక్కల్లా మాటలనుకోవటం. మేమెప్పుడూ చేయలేదు. సమస్య తేలకపోతే మా ఇంటిపక్కనే ఉన్న వాళ్ళను పిలుస్తా – మా సమస్యను వాళ్ళకు చెప్తాం! వాళ్ళు చెప్పే నిర్ణయానికి కట్టుబడి ఉంటాం! ఇంక గొడవలెందుకవుతాయ్ అసలు?”

చూడు మోహన్ – పెళ్ళనేది మున్నాళ్ళ ముచ్చట కాదు – వందేళ్ళ పంట! ఇలాంటి చిన్న చిన్న గొడవలూ కొట్లాటలెన్ని వచ్చినా అవన్నీ ఆ వందేళ్ళ పంటను మరింత బలపరచాలిగానీ నాశనం చేయకూడదు–”

లక్ష్మీ మళ్ళీ అందుకుంది

“చూడమ్మా! భర్తతో గొడవపడి మంగళ సూత్రం తెంపి అతని మొఖాన్న విసిరికొడతానన్నావ్! కానీ తర్వాత ఏమిటి నీ గతి? రేపు ఇంకో పెళ్ళి చేసుకున్నా అక్కడ కూడా ఈ కథ పునరావృతం కాదని ఏమిటి గారంటీ? ఇలా ఎంతమంది మొఖాన్న తాళి విసిరి కొడతావ్? ఎంతమందినని పెళ్ళి చేసుకుంటావ్? ఆడదానికి ఎప్పటికయినా తన భర్త ఇల్లే స్వర్గమవుతుందమ్మా! ‘నా పుట్టిల్లు అనే ఆలోచన ఒక ఎండమావి!”

రంగారెడ్డి మోహన్రావ్ భుజమీద ఆప్యాయంగా చేయి వేశాడు. “భార్యాభర్తలన్నాక ఒకరినొకరు గౌరవించటం నేర్చుకోవాలి మోహన్రావ్! నీ మంచికోరి భార్య ఇచ్చే

సలహాలను కొట్టి పారేస్తే ఇంక నీ మంచి కోసం ఆలోచించే ఆరెవరుంటారు? నీ మేలు ఎవరు కోర్తారు? నీ భార్యకు నువ్వే గౌరవం ఇవ్వలేకపోతే బయటివాళ్ళెందుకిస్తారు?"

మోహన్రావ్, రాధలు మొఖాలు చూసుకున్నారు. ఇద్దరి మొఖాల్లోనూ పశ్చాత్తాపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

"అవును రంగారెడ్డీ! నేను నిజంగానే పెద్ద ఇడియెట్లాగా ప్రవర్తించాను అయామ్ సారి"

ఆ మాటతో రాధ కరిగిపోయింది.

"మీరే కాదు – నేనూ పంతం కొద్దీ నోటికి వచ్చినట్లు మాట్లాడాను – ఎవరయినా నాతో వాదించడం మొదలు పెడితే తప్పు నాదని తెలిసినా, అవతలివాళ్ళ నోరు మూయించాలనే నా మెంటాలిటీని ఎలా మార్చుకోవాలో నాకు తెలీటంలేదు" అంది దీనంగా చూస్తూ–

"చూడమ్మా! మీ ఇద్దరూ భార్యభర్తలు. మీలో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా గెలుపు మీ ఇద్దరికీ వర్తిస్తుంది. ఎందుకంటే 'భార్యాభర్తలు' అనేది ఒకే కుటుంబం అవుతుంది–" అన్నాడు రంగారెడ్డి.

రాధకు కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్. లక్ష్మి వేపు నీరునిండిన కళ్ళతో చూసింది.

"నిజంగానే మీ మాటలు మాలో చక్కని మార్పు తీసుకొచ్చినయ్. మీలాగా ఒకరినొకరు గౌరవించుకుంటే ఏ సంసారంలోనూ సమస్యలే ఉండవు. ఇవాళ సమయానికి మీరు రాకపోయినట్లయితే మా సంసారం కూలిపోయి ఉండేది. పుట్టిల్లు అనేది ఒక ఎండమావి అనే విషయం ఎంతో అర్థవంతంగా చెప్పారు – పెళ్ళయేంతవరకూ ఆడ పిల్లకు పుట్టినిల్లు తర్వాత అదే పరాయి ఇల్లు – అయామ్ సారి! కోపంలో ఏవేవో మిమ్మల్ని కూడా అన్నాను" అందామె బాధగా

"రాధా! నన్ను క్షమించు – నిన్ను చాలా హీనంగా ట్రీట్ చేశాను" అన్నాడు మోహన్.

"అలా అనకండి – నేను చాలా చెడుగా ప్రవర్తించాను–"

రంగారెడ్డి, లక్ష్మీ ఆనందంగా మొఖాలు చూసుకున్నారు.

"మాకూ ఇవాళ చాలా ఆనందకరమయిన రోజు మోహన్! మిమ్మల్నిద్దరినీ మళ్ళీ ఒకటిగా చేసినందుకు ఎంతో సంతోషంగా ఉంది–" అన్నాడు రంగారెడ్డి ఆనందంగా.

"మీరు మాట్లాడుతూండండి – అన్నయ్యగారూ – ఇప్పుడే అందరికీ టీ చేసుకొస్తాను – కనీసం 'టీ' అయినా తాగకుండా వెళ్ళి పోవటం భావ్యం కాదు" అది రాధ.

"హమ్మయ్య – ఇప్పుడు హాపీగా ఉంది బ్రదర్" అన్నాడు మోహన్రాన్. "అది సరేగానీ నా పెళ్ళికి మీరెందుకని రాలేదు. చెప్పలేదేమిటి"? అడిగాడతను.

"అసలు మేము నీ పెళ్ళికి బయల్దేరాలని బస్‌లు రిజర్వేషన్ కూడా చేసుకున్నాం మోహన్! తీరా సాయంత్రం బయల్దేరతామనంగా ఉదయం ఇంటికి బంధువులెవరు వచ్చారు – ఎవరంటే.... ఆ! గుర్తు కొచ్చింది. అనకాపల్లి నుంచి మా చిన్నాయన కూతురొచ్చింది–"

"మీ చిన్నాయన కూతురు కాదండీ– అనంతపూర్ నుంచి రత్నాకర్ వచ్చాడు" అంది లక్ష్మి అతనిని సరిజేస్తూ.

"రత్నాకరా? రత్నాకర్ వచ్చింది పద్నాలుగతో తారిఖున – ఆ రోజునే మా సిస్టర్ బేబీ వాళ్ళ కొడుకు బాబ్జీ పుట్టి న్రోజు కూడాను–"

"మీకు మతి మరపు వచ్చినట్లుంది బాబ్జీ పుట్టిన్రోజు ఆగస్ట్ పదిన"

రంగారెడ్డి ఓ క్షణం ఆలోచించాడు.

"నువ్వే మతిలేకుండా మాట్లాడుతున్నావ్! నువ్ చిన్నా పుట్టిన్రోజు సంగతి గుర్తుంచుకుని చెప్తున్నావ్ – చిన్నా పుట్టిన్రోజుకి మనం బిర్లామందిర్ వెళ్ళాం కూడా"

"ఛ – కాదు! చిన్నా పుట్టిన్రోజుకి మనం వెళ్ళింది సాంఘి టెంపుల్‌కి–"

"కాదే – మన మారేజ్ డే నాడు సాంఘి టెంపుల్‌కెళ్ళాం. ఆరోజే నువ్ అబిడ్స్‌లో చీరకూడా కొనుక్కున్నావ్ – ఆ షాపులో మీ ఫ్రెండ్ రాజేశ్వరి కనిపించింది కూడా–"

"రాజేశ్వరి కనిపించింది మనం రవీంద్ర భారతిలో! ఆ అంట్ల వెధవెవరో సినిమా వాళ్లకు సన్మానం చేస్తున్నప్పుడు చూడ్డానికెళ్ళినప్పుడు! అబిడ్స్‌లో కనిపించింది రత్నమాలం!"

"పిచ్చి వాగుడు వాగకే – రత్నమాల మనం జయభేరి సినిమా – చూడ్డానికి కళాతోరణానికి వెళ్ళినప్పుడు కనిపించింది–"

"ఛ – ఊరుకోండి లలిత కళాతోరణంలో మనం చూసింది అదేదో నికృష్టపు సినిమా! అన్నీ బూతు మాటలున్నాయ్ అందులో – సగంలో లేచి వెళ్ళిపోయాం – గుర్తులేదూ?"

"నువ్ ఊరికే కన్ఫ్యూజవుతున్నావ్! ఆ బూతు సినిమా చూసింది మన రాజు వాళ్ళ రెండో అబ్బాయి బారసాల రోజున–"

"మీకు నిజంగానే పిచ్చి ఎక్కినట్లుంది. రాజు వాళ్ళ అబ్బాయ్ బారసాల కాదది – అన్న ప్రాసన–"

"నీకేమయినా బుద్ధుందంటే? అన్నీ అలా దబాయిస్తావెందుకు? మొన్నటికి మొన్న ఇలాగే అకేలేహమ్ అకేలేతుమ్‌లో హీరో అమీర్‌ఖాన్ అంటే కాదు సల్మాన్ ఖాన్ అని నా నోరు మూయించావ్ – తీరా నేను పత్రికాఫీస్‌కి ఫోన్ చేసి కనుక్కుంటే అప్పుడు నేనే కరెక్టని తెల్సింది–"

"సిగ్గులేకపోతే సరి – అమీర్ ఖాన్ అని పందెం కట్టింది నేను మీరే "కాదు సల్మాన్" అన్నారు".

"ఏయ్ నోరు మూసుకోవే – ఇష్టం వచ్చినట్లు నోటికొచ్చింది వాగటమే కాకుండా అబద్ధాలు కూడా చెప్పటం నేర్చుకొన్నావ్–"

"పిచ్చివాడుడువాగకండి, అబద్దాలు చెప్పే అలవాటు మా ఇంటా వంటా లేదు. మీ  వంశంలోనే అబద్ధాల కోర్లున్నారు–"

"ఏమిటి మీ వంశంలో అబద్దాల కోర్లున్నారా? ఎవరో చెప్పవే – లేకపోతే చెప్పు తీసుక్కొడతా నిన్ను? కమాన్ చెప్పు."

"చెప్పు తీసుక్కొడితే పడే వాళ్ళెవరూ లేరు ఇక్కడ! ఏం మీ అమ్మ అబద్దాలాడలేదా? రెండు తులాల బంగారం కోసం గడ్డి తినలేదూ?"

"అబద్దాల కోర్లు మీ వాళ్ళే – పెళ్ళికి ముందు నాకు ఎనిమిది తులాల బంగారం పెడతానని ఆరు తులాలకు కక్కుర్తి పడింది. మీ అమ్మకాదూ?"

"కాదు – రెండు తులాల కోసం కక్కుర్తి పడింది మీ అమ్మే."

"ఏయ్ – అలా కక్కుర్తి పడటం నీకలవాటు – మీ వాళ్ళకలవాటు. మా వాళ్ళు రాయల్ పీపుల్! డబ్బులిరజిమ్మారు పెళ్ళిలో."

"అవును – బాగా విరజిమ్మారు. అందుకే మా వాళ్ళు నా కోసం కొన్న ఎలక్ట్రిక్ కుక్కర్ మీ చెల్లెలికిచ్చింది మీ అమ్మ."

రంగారెడ్డికి కోపం ఆగలేదు.

"అతిగా వాగావంటే చెప్పుతీసుక్కొడతా! మనం ఆ కుక్కర్ వాడటం లేదనే మా చెల్లిలికి ఇచ్చింది మా అమ్మ! అదీ నన్నడిగే ఇచ్చింది." లక్ష్మి ఆవేశం పట్టలేక లేచి నిలబడింది.

"మాట్లాడితే చెప్పుతీసుకుకొడతానంటే – పడే వాళ్ళెవరూ లేరిక్కడ." ఆ మాటనేనూ అనగలను – జాగ్రత్త!" అంది రోషంగా.

"ఏమిటి? నన్ను చెప్పు తీసుక్కొడతానంటావా? మీ అమ్మనూ నాన్ననూ చూసి రెచ్చిపోదామనుకుంటున్నారేమో – ఈ రోజే జట్టు పట్టుకుని బయటికీడుస్తా? నా సంగతి నీకు తెలీదింకా."

రాధ ట్రేలో 'టీ' తీసుకొచ్చి వాళ్ళ గొడవ విని స్టన్ అయిపోయింది.

మోహన్ చప్పున కల్పించుకున్నాడు.

"రంగారెడ్డీ – ఇంత చిన్న విషయానికి గొడవ పడుతున్నారేమిటి? కూల్‌డౌన్ యార్"

"అవును లక్ష్మిగారూ! ఇంక అక్కడితో వదిలేయండి – మాటామాటా అనుకుంటూ పోతే అలా పెరుగుతూనే ఉంటుంది." అంది రాధ.

"ఇప్పుడే కాదు మోహన్ – మొదట్నుంచీ చూస్తూనే ఉన్నా! మొగుడంటే లెఖ్ఖ లేద్దీనికి! కిందటి సారేం చేసిందో చూశావా? మా ఆఫీస్ వాళ్ళు సరదాగా శెలవు రోజున పేకాడు కుందామని వస్తే మర్యాద లేకుండా మాట్లాడింది. దాంతో వాళ్ళు హర్ట్ అయి వెళ్ళిపోయారు–

"అప్పుడే కాదు ఎప్పుడు అలాంటి చిల్లర వెధవలు నాయింటికొచ్చినా ఖచ్చితంగా అంటాను. అలాంటి వెధవల్ని స్నేహితులంటానికి మీకు సిగ్గుండాలసలు"

"చూశారా? మొగుడంటే గౌరవం ఉన్న ఆడది మాట్లాడాల్సిన తీరేనా ఇది?"

"ఏమిటి గాడిద గుడ్డు గౌరవం నీకిచ్చేది? నువ్వేం కలెక్టరువా, గవర్నరువా, మర్యాదస్తుడివా? ముష్టి పదివేల జీతం మంచి లెక్చరర్ సంబంధం వదులుకుని మీ వాళ్ళు చెప్పిన అబద్దాల వల్ల నిన్ను చేసుకున్నాను."

"వాడినే చేసుకోవలసింది – నీలాంటి ఫాల్తూ ఆడదాన్తో కాపురం చేయలేక ఆత్మహత్య చేసుకు చచ్చేవాడు"

"మరాపని నువ్వా చేయవచ్చుగా – ఎందుకు చేయటం లేదు?"

'నేనెందుకు ఛస్తానే – నీ అంతుచూశాకే ఛాస్తా"

"నువ్విలాంటి వాడివని మా అన్నయ్య ఎప్పుడో చెప్పాడు నాకు"

"వాడో లుచ్ఛా వెధవ కాబట్టి ఆ మాటన్నాడు"

"మా అన్నయ్యను లుచ్ఛా అన్నవాడు దగుల్బాజీ"

"ఏంటీ? నన్ను దగుల్బాజీ అంటావా? రాస్కెల్ – "అంటూ లేచి ఆమె జట్టు పట్టుకున్నాడు రంగారెడ్డి.

"పోవే – పో వెళ్ళు ఆ లుచ్ఛా గాడింటికి. అక్కడే జీవితాంతం కుక్క బ్రతుకు బ్రతుకు. బ్రతుకు ఫో – వెళ్ళు"

అంటూ ఆమెను బయటికీడుస్తూంటే మోహన్ లక్ష్మి అడ్డుపడి విడిపించారు.

"వెళ్ళక నీలాంటి లుచ్ఛాగాడింట్లో పడి ఉంటాననుకున్నావేమిటి? – మా అన్న ఇంట్లో కుక్కబతుకయినా పరవాలేదు – సంతోషంగా ఉండవచ్చు కానీ నేను వెళ్ళిపోయాక నీ బతుకే చూసుకో – కుక్కలు చింపిన విస్తరవుతుంది".

"ఫోవేవే – పో నీలాంటిందాన్ని పెళ్ళి చేసుకుంటా"

"థూ–నీ మొఖం చూస్తేనే అసహ్యం నాకు"

ఆమె వెళ్ళిపోయింది విసవిసా నడిచి–రంగారెడ్డి మరోవేపు వెళ్ళిపోయాడు మోహన్, రాధ నిశ్చేష్టులయిపోయారు.